# దూరదృష్టి

కుచేలుడు తన శైశవ మిత్రుడైన కృష్ణుని దగ్గరకు వెళ్ళబోతున్నప్పుడు, ఒకవేళ ద్వారపాలకుడు అడ్డగిస్తే, అతని చేతిలో ఏదైనా పెడదామన్నా 'నేనేమీ లేని కటిక దరిద్రుణ్ణే' అని బాధపడతాడు. అయిదు వేల సంవత్సరాల కిందటే అలా ఉన్నప్పుడు - నేటి కార్యాలయాల్లో ఆమ్యామ్యా లేనిదే పని అవుతుందా? అదీకాక, ముడుపులు చెల్లించనిదే కోరికలు తీర్చని వేంకటరమణుడు అనే దేవుడొకడు ఉన్నాడే? సామాన్య మానవుల విషయం చెప్పాలా?

ఇటువంటి అవినీతి ప్రపంచంలోని ఒకానొక కార్యాలయంలో అడుగు పెట్టాడు రేవతీపతి. భూమి తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరగడానికి ఎంతకాలం పడుతుందో, అన్నాళ్ళనుంచీ ఆ కార్యాలయం చుట్టూ పరిభ్రమిస్తున్నాడు రేవతీపతి. ముందే ఆ గుమస్తాలకీ, మేనేజర్‌కీ ఎవరిది వారికి పారేస్తే, కనీసం మకర సంక్రమణంనాడు మొదలుకొని, కర్కాటక సంక్రమణం నాటికైనా తన పని అయ్యుండేది. అటువంటిది మళ్ళీ మకర సంక్రమణం దాటింది.

కనీసం ఈనాటికైనా తన పని అవకపోతే ఓ రెండొందలు చేతిలో పెడదామని అనుకున్నాడు రేవతీపతి. తను కార్యాలయంలో అడుగు పెట్టేసరికి 'బాల శశాంకమౌళి - మేనేజర్' అని కొత్తబోర్డు ఉంది. ఓహో! పాతాయన ట్రాన్స్‌ఫర్ అయిపోయాడన్నమాట!

"నమస్కారమండీ! నా పేరు రేవతీపతి. నా పెర్మిట్టు..." అని అనగానే "ఓహో మీరేనా? కూచోండి కూర్చోండి" అని కుర్చీ చూపెట్టాడు

బాలశశాంకమౌళి.

రేవతీపతి చేతులు జోడిస్తూ కూర్చున్నాడు.

"ఇదిగో మీ కాయితం." రేవతీపతి చేతి కందించాడు బాలశశాంకమౌళి.

రేవతీపతి ఆశ్చర్యపోయాడు. కొత్త మేనేజర్ బాలశశాంక మౌళిగారు ఎంత సహృదయులు!

రేవతీపతి కృతజ్ఞతాసూచకంగా రెండు వందరూపాయల కాగితాల్ని బాలశశాంక మౌళిగారి టేబుల్ డ్రాయర్లో పడేశాడు.

"క్షమించాలి. నాకు భగవంతుడిస్తున్న జీతం ఏదో చాలు. తీసుకోండి!" అని డ్రాయర్‌లోంచి రెండొందలూ తీసేసుకోమన్నాడు రేవతీపతిని.

"ఉంచండి సార్! పరవాలేదు. ఏదో నా సంతోషం కొద్దీ నే నిచ్చాను. మీరు నన్నేం అడగలేదు కదా?" అన్నాడు రేవతీపతి.

బాలశశాంకమౌళికి కోపం వచ్చింది. "ముందు డ్రాయర్‌లోంచి డబ్బు తీస్తారా? లేక పోలీసుల్ని పిలిపించి, నాకు లంచం ఇవ్వబోతున్నారంటూ అరెస్ట్ చేయించమంటారా?"

రేవతీపతి వణికిపోయాడు. "క్షమించండి సార్! వెళ్ళిపోతున్నాను" అంటూ మేనేజర్‌గారి డ్రాయర్‌లోంచి రెండు వందలూ తీసుకుని వెళ్ళిపోయాడు.

చీకటిలో చిరుదివ్వెలా బాలశశాంకమౌళి వంటి నిజాయితీపరులు ఉండబట్టే ఈ కలియుగంలో ధర్మం అన్నది కనీసం కుంటి కాలుతోనైనా నడుస్తోంది కదా అనుకున్నాడు రేవతీపతి.

ఒకనాటి రాత్రి సుమారు పది గంటలప్పుడు తలుపులు మూసుకుని పడుకోబోతుండగా తలుపు చప్పుడైంది. తీసి చూస్తే ధర్మరాజైన బాలశశాంకమౌళి. "ఇదేమిటి చెప్మా? ఎటూ కానివేళ హఠాత్తుగా మా ఇంటికి విచ్చేశారు!" అని చోద్యపడ్డాడు రేవతీపతి.

"రేవతీపతిగారూ! గొప్ప ఆపద వచ్చి పడిందండీ. నా భార్యని చాలా సీరియస్ కండీషన్‌లో హాస్పిటల్లో చేర్పించవలసి వచ్చిందండీ. ఖరీదైన మందులు రాశారు డాక్టరుగారు. ఓ రెండు వందలుంటే సర్దుదురూ!" అన్నాడు మేనేజర్ బాలశశాంకమౌళి.

'ఎటూకాని వేళ, ఇంత రాత్రప్పుడు ఎంతో అవసరం లేకపోతే

బాలశశాంకమౌళి వంటి ఉన్నతమైన వ్యక్తులు మా ఇంటికి వస్తారా?' అనుకున్నాడు రేవతీపతి.

ఎలాగూ లోగడ తనకు పెర్మిట్ ఇప్పించినందుకు ఇద్దామనుకున్న రెండు వందలూ- ఇవాళ ఇచ్చేశాడు రేవతీపతి.

"మీరు చేసిన సహాయానికి చాలా కృతజ్ఞణ్ణండీ! మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను" అని చేతులు జోడిస్తూ సెలవు పుచ్చుకున్నాడు బాలశశాంకమౌళి.

మర్నాడు రేవతీపతి ఇంటికి ఓ మిత్రుడు వచ్చి, తాను ఆపదలో ఉన్నానని ఓ రెండొందలు చేబదులు ఇమ్మని అడిగాడు.

"చంపేశావురా బాబూ! నిన్న రాత్రే ఆ ధర్మాత్ముడైన మేనేజర్‌కి, తన భార్య ఆస్పత్రిలో ఉందంటే నా దగ్గరున్న రెండు వందలూ ఇచ్చేశాను. - సారీ!" అన్నాడు రేవతీపతి.

"అదేమిటయ్యా బాబూ! నిన్న రాత్రి ఆ మేనేజరు తన బాధ ఏదో వెళ్ళగక్కితే, నా దగ్గరున్న రెండొందలూ ఇచ్చేశాను - నిన్నడిగి తీసుకోవచ్చుననే ధీమాతో' అన్నాడా మిత్రశ్రీ.

"నువ్వా? నువ్వెందు కిచ్చేశావు డబ్బు? అతనితో నీ కెలా పరిచయమైంది?" అడిగాడు రేవతీపతి.

"వాళ్ళాఫీసు కెళ్ళాను ఏదో పనిమీద. నా పని సకాలంలో చేసిపెట్టాడు కదా అని ఓ వందరూపాయ లివ్వబోయాను. నేనేం లంచగాండి ననుకున్నారా? నాకు భగవంతు డిస్తున్న డబ్బేదో చాలు. వెళ్ళండి వెళ్ళండి" అని కసురుతున్నట్టు మాట్లాడాడు. అతని వంటి నిజాయితీపరులు లక్షకొకడుంటా డనుకొని లోలోన ఎంతో సంతోషించాను" చెప్పాడు మిత్రుడు.

మేనేజర్ బాలశశాంకమౌళి ఆ ఊరినుంచి ట్రాన్స్‌ఫరై ఆరు నెలలైంది గాని రేవతీపతికి గాని, తన మిత్రునికి గాని సొమ్ము తిరిగి వాపసు కాలేదు.

బాలశశాంకమౌళి అప్పు రూపేణా డబ్బు పుచ్చుకుంటున్నప్పుడు - "మీ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేను" అని చెప్పనే చెప్పాడు. సరే తామెలాగూ తమ పని చేసిపెట్టినందుకుగానూ ఇద్దామనుకున్న మామూలు ఈ విధంగా పోయిందిలే అనుకున్నారిద్దరూ.

అయితే బాలశశాంకమౌళి ఆంతర్యంలో ఉన్న విషయం.

లంచం రూపంలో బాలశశాంక మౌళి డబ్బు గాని పుచ్చుకుంటే - ఆ ఇచ్చిన వ్యక్తి ముందుగా ఏంటీ కరప్షన్ బ్యూరో వారికి తెలియపరిచి, ఫినాప్తలీన్ పౌడరు జల్లి, సోడియం కార్బొనేట్ పూసి, నోట్ నంబర్లు నోట్ చేసుకున్న నోట్లుగాని ఇస్తే బాలశశాంకమౌళి ఉద్యోగం ఊడిపోయి ఖైదీ రుద్రయ్య అనే నామకరణం జరిగేదే కదా?

బాలశశాంకమౌళికి ఇంత దూరదృష్టితో కూడిన ఐడియా ఎవరిచ్చారయ్యా అంటే - అతని అర్ధనారి గౌరి. గౌరి తండ్రి ఏసీబీ ఇన్‌స్పెక్టరు!

● ఆంధ్రప్రభ వీక్లీ ●
*10-1-1990*